క్లుప్తంగా

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులాహ్వానం

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణకు అర్హత కలిగిన విద్యార్థు లు, యువత నుంచి దరఖాస్తులాహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ నీలం గోవిందరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి. కృష్ణాజీ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ బేసిక్ కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాల 90100 23033 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు తప్పనిసరి

గజపతినగరం: రైతులంతా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకుని, ఈకేవైసీ చేయించుకోవాలని గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలు ఈ–క్రాప్, ఈకేవైసీ చేస్తారని, ఇంకా ఎవరైనా ఈ–క్రాప్‌లో పంటల వివరాలను నమోదు చేసుకోకపోతే ఈనెల 21వ తేదీలోగా చేయించుకోవాలని చెప్పారు.ఈ–క్రాప్ చేయించుకోకుంటే ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బతింటే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రాదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకునే అవకాశం ఉండదన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు



పీడీలతో సమావేశమైన ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు

వేపాడ: స్థానిక ఉన్నత పాఠశాల వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ –14, అండర్–17 విభాగాల్లో వివిధ క్రీడాంశాల్లో శుక్రవారం, శనివారం మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ జగదీశ్వరరావు తెలిపారు.క్రీడాపోటీల నిర్వహణపై ఉన్నత పాఠశాలల పీడీలతో ఎమ్మార్సీ లో గురువారం సమావేశం నిర్వహించారు.పోటీల నిర్వహణపై పీడీలకు ఎంఈఓ పలు సూచనలు చేసి, విజయవంతం చేయాలని కోరారు. ఎంఈఓ–2 బాలభాస్కరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేపాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆశాఖ ఏఈ జి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వీలుపర్తి, వెల్దాం, పెద దుంగాడ, చినదుంగాడ, చామలాదేవి అగ్రహారం, వావిలపాడు, కడకొండ, దబ్బిరాజుపేట, చామలాపల్లి, వెంకయ్యపాలెం, పోతుబందిపాలెం, కరకవలస, మారిక గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదుకు 23 వరకు గడువు

వేపాడ: ఖరీఫ్ పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకునేందుకు ఈనెల 23 వర కు గడువు పెంచినట్లు ఏఓ సి.బి.యశ్వంతరావు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఇంకా ఈ–క్రాప్ చేయించుకోని రైతులు తమ ఆధార్, వన్‌బీ, ఫోన్ నంబర్ రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలకు ఇస్తే పంటల వివరాలను నమోదు చేస్తారని, అనంతరం ఈకే వైసీ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతీ రైతు పంటల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

వేంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో 'మోడల్ యూఎన్'



ప్రొఫెసర్స్‌తో మోడల్ యూఎన్ నిర్వహించిన విద్యార్థులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి వేంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో గురువారం నమూనా ఐక్యరాజ్య సమితి (మోడల్ యూఎన్) కార్యక్రమం నిర్వహించారు. దేశాభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యువమంథన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల డీన్ మక్కేన శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు ఐక్యరాజ్య సమితి సాధారణ సభ నమూనాలో సమావేశమై మెరుగైన పర్యావరణం కోసం అనుసరించాల్సిన జీవనశైలి అనే అంశంపై చర్చించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుధారాణి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ ఇక్బాల్‌హైదర్, డాక్టర్ రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా నిలిచిన రోడ్డు పనులు



దత్తి-బోజరాజపురం రోడ్డులో గత ప్రభుత్వ హయాంలో జేసీబీతో చేపడుతున్న ఎర్త్‌వర్క్ పనులు (ఫైల్)

- ముందుకు సాగని దత్తి–బోజరాజపురం గ్రామాల తారురోడ్డు నిర్మాణం
- రూ.2.50 కోట్లు మంజూరు చేసిన గత ప్రభుత్వం
- ఎర్త్‌వర్క్,ఇతర పనులు చేశాక వచ్చిన ఎన్నికల కోడ్
- కూటమి ప్రభుత్వం వచ్చాక పనుల ఊసే లేదు



ప్రస్తుతం అధ్వానంగా ఉన్న రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి, బోజరాజపురం గ్రామాలను అనుసంధానం చేసే గ్రావెల్ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామా ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో ఈమార్గంలో రాకపోకలు సాగించలేకపోతున్నామని ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈరోడ్డు మరింత అధ్వానంగా తయారయ్యింది. రోడ్డు సమస్యను పరిష్కరించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను బోజరాజపురం గ్రామ స్తులు కోరారు. దీంతో ఆయన స్పం దించి దత్తి నుంచి బోజ రాజపురంనకు తారురోడ్డు మంజూరు చేయించారు. రెండున్నర కిలో మీటర్ల మేర 30 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించేందుకు, మూడు చోట్ల మినీ కల్వర్టులు, అయిదు చోట్ల పైపులైన్ కానాలు నిర్మించేందుకు అధికారులు ప్రతి పాదనలు సిద్ధం చేశారు.గత ప్రభుత్వ పెద్దలతో అప్పటి ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడి ఏపీఆర్‌ఆర్‌పీ నుంచి రూ.2.50 కోట్లు మంజూరు చేయించారు. టెండర్ దక్కించుకున్న సంబం ధిత కాంట్రాక్టర్ రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకల తొలగింపు పనులతో పాటు ఎర్త్ వర్క్ పనులు చేశారు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో పనులకు బ్రేక్ పడింది.ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పెద్దలు ఈపనుల సంగతిని పూర్తిగా విస్మరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డంతా బురదమయం కావడంతో రాకపోకలు సాగించేదుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అర్ధంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తి చేయాలని దత్తి, బోజరాజపురం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మా దారి సంగతి తేల్చాకే పనులు చేయండి



రాజాం రోడ్‌లో ఆర్‌ఓబీ పనులను అడ్డుకుంటున్న రిక్షాకాలనీ, కొత్తఅగ్రహారం వాసులు

- ఆర్‌ఓబీ పనులు అడ్డుకున్న రిక్షాకాలనీ, కొత్తఅగ్రహారం వాసులు
- సర్వీస్ రోడ్డు లేకుండా ఆర్‌ఓబీ ఎలా నిర్మిస్తారు?
- 15 అడుగుల సర్వీస్ రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్

చీపురుపల్లి: రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు బాగానే ఉంది.. కానీ మా దారి సంగతి ఏమిటో ముందు తేల్చండి.. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే తమ గ్రామాలకు ఎలా రాకపోకలు సాగించాలి?.. కేవలం నాలుగైదు ఇళ్ల కోసం ఏకంగా నాలుగైదు గ్రామాల రాకపోకలను లేకుండా చేస్తారా? ఎట్టి పరిస్థితుల్లోనూ తమదారి సంగతి తేల్చేకే రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరపాలని రిక్షాకాలనీ, కొత్త అగ్రహారం నివాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ రెండు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు గురువారం పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎల్.దామోదర్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని ఆర్అండ్‌బీ అధికారులను పిలిపించి చర్చలు జరిపారు. పట్టణంలోని విజయనగరం–రాజాం ప్రధాన రోడ్డులో ఉన్న పురాతన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పాడైన నేపథ్యంలో భారీ వాహన రాకపోకలను నిషేధించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌ఓబీ నిర్మాణానికి రూ.13 కోట్లు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రాజాం రోడ్‌లో గాంధీబొమ్మ కూడలి తరువాత కొత్తఅగ్రహారం, రిక్షా కాలనీతో పాటు గరివిడి మండలంలోని కె.ఎల్.పురం, కందిపేట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించే రహదారి ఉంది. ప్రస్తుతం ఆర్‌ఓబీ పనులు పూర్తయితే ఈ రోడ్డుపై రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. కనీసం అత్యవసర వేళ అంబులెన్స్ వెళ్లే పరిస్థితి లేదు. సర్వీసు రోడ్డు ఏర్పాటుచేసేవరకు పనులు చేస్తే ఊరుకోబోమని తేల్చిచెప్పారు. ఎస్‌ఐ దామోదర్, ఆర్అండ్‌బీ డీఈ రవిశంకర్‌లు మూడు రోజుల్లో సంబంధిత రైల్వే కాంట్రాక్టర్లు, రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గొర్రిపాటి పేరు తొలగించడం అవమానకరం



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ నరసింహమూర్తి

గంట్యాడ: తాటిపూడి జలాశయానికి స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును తొలగించి, ఈ ప్రాంత ప్రజలను కూటమి ప్రభుత్వం అవమానిం చిందని ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ గొర్రిపాటి బుచ్చి అప్పారావు ఒక కులానికి, మతానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరి వాడని అన్నారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో ఎంతో మందికి భూములు ఇప్పించారని, పూర్వం హరిజనులకు దేవాలయాల్లో ప్రవేశం లేకపోతే వారికి ప్రవేశం కల్పించిన మహనీయుడు అని అన్నారు. తాగునీటి కోనేరులు, బావుల వద్ద అందరితో పాటు హరిజనులకు కూడా మంచినీళ్లు తీసుకు వెళ్లే అవకాశం కల్పించారని చెప్పారు. 1967లో ఎమ్మెల్యేగా పనిచేశారని, ఈప్రాంత ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆయన సేవలను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాటిపూడి జలాశయానికి ఆయన పేరును పెడుతూ జీఓ జారీ చేసిందని గుర్తుచేశారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి పేరు తొలగిస్తూ జీఓ జారీ చేసిందని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలతో పాటు చేపట్టిన ప్రతీ కార్యక్రమాన్ని చెరిపేయడమే పనిగా కూటమి ప్రభు త్వం పెట్టుకుందని ఆరోపించారు. తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి పేరున పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కక్షసాధింపులతో వీఓఏ (గ్రామైఖ్య సంఘం సహాయకులు), ఫీల్డ్ అసిస్టెంట్లు, పాఠశాలల వాచ్‌మన్‌లు వంటి చిరుద్యోగులను తొలగించడమే పనిగా పెట్టుకున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలని సూచించారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, పెణసాం ఎంపీటీసీ లెంక మోహన్ రావు, నాయకులు లచ్చిరెడ్డి కృష్ణ,గులిపల్లి గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో చిన్నారుల ప్రతిభ



గ్రేడింగ్ బెల్ట్స్ సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శాంతి, కోచ్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట: పట్టణంలోని మహంతి కౌముది గ్లోబల్ స్కూల్‌కి చెందిన చిన్నారులు విశాఖలో నిర్వహించిన కరాటే పోటీల్లో పాల్గొన్ని సత్తా చాటి గ్రేడింగ్ బెల్ట్స్ అందుకున్నారు. శారీరక దారుఢ్యం, వ్యక్తిగత భద్రత కోసం స్కూల్‌లో కరాటే శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గ్రేడింగ్ బెల్ట్స్ ఇవ్వడం కోసం విశాఖలో ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇటీవల నిర్వహించిన కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కౌముది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు కోచ్ శ్రీనివాసరావు నేతృత్వంలో పోటీపడ్డారు. ప్రతిభ కనబరిచి గ్రేడింగ్ బెల్ట్స్ అందుకున్న చిన్నారులను ప్రిన్సిపాల్ శాంతి మహంతి, తదితరులు గురువారం ప్రత్యేకంగా అభినందించారు.


కేజీబీవీలో తనిఖీలు



వంటలను పరిశీలిస్తున్న విజిలెన్స్ మెంబర్ పద్మలత

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) జిల్లా ఫుడ్ విజిలెన్స్ మెంబర్ వి.పద్మలత గురువారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థినుల సంఖ్య, మెనూ ప్రకారం వంటలు వండినదీ, లేనిదీ కేజీబీవీ ప్రత్యేకాధికారి ధనలక్ష్మిని ఆరా తీశారు. అలాగే స్టోర్‌రూమ్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.

పాఠశాల సందర్శన



విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని శింగరాయి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్‌లు, హాజరు, ఇతర రికార్డులు, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యజాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం వంట లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

నేడు 'పి.లింగాలవలస'లో గ్రామ సందర్శన

దత్తిరాజేరు: మండలంలోని పి.లింగాలవలసలో శుక్రవారం ఉదయం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల,రేషన్ డిపోను అధికారుల బృందం పరిశీలిస్తుందని తెలిపారు

146 మద్యం సీసాలు సీజ్

గజపతినగరం: నియోజకవర్గం కేంద్రంలో స్కూటీపై అక్రమంగా 146 మద్యం సీసాలను తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై కె.లక్ష్మణరావు గురువారం రాత్రి తెలిపారు. వారి దగ్గర పట్టుబడిన మద్యం సీసాలను సీజ్ చేసినట్లు చెప్పారు.

ప్రతీ నెల రక్తపరీక్షలు చేయాలి

గజపతినగరం:



వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

గర్భిణులకు, బాలింతలకు ప్రతీ నెల రక్తపరీక్షలు చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఎస్‌ఓ డి.ధర్మారావు వైద్యా రోగ్య సిబ్బందికి సూచించారు. తుమికాపల్లి గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం సంద ర్శించింది.హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పరిధిలోని గర్భిణులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో, స్కూళ్లలో పిల్లలకు చేసిన రక్తపరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్‌ఓ ధర్మారావు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిం చాలని, రక్త హీనత సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారంతో పాటు, జాగ్రత్తలను సూచించాలని సిబ్బందికి చెప్పారు. డీపీ హెచ్‌ఎన్‌ఓ సత్యవతి, డీపీఓ జి.రామాంజులనాయుడు, డీడీఎం ఏ.బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

శృంగవరపుకోట: జిల్లా కేంద్రం విజయనగరంలో నవంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న సీపీఐ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ కామేశ్వరరావు మాట్లాడుతూ మూడురోజుల పాటు జరిగే మహా సభల్లో 27న నిర్వహించనున్న బహిరంగసభకు, ర్యాలీకి విద్యార్థులు లక్షలాదిగా హాజరై ఉత్తరాంధ్ర వాణి విని పించాలని కోరారు. సభల్లో ఏఐఎస్‌ఎఫ్ ఆలిండియా నాయకత్వం పాల్గొంటుందని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం, నియోజకవర్గ కార్యదర్శి డి.అప్పలరాజు, మండల కార్యదర్శి కె.భీముడు, పి.అప్పారావు, ఎస్.శ్రీను, డి.రామకృష్ణ, పి.గౌరీశంకర్, బి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినతి



సీఎండీ కార్యాలయ అధికారులతో మాట్లాడుతున్న ఫేకర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్‌నగర్‌లోని ఎంప్లాయిస్ కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని విశాఖపట్నం తూ ర్పుప్రాంత విద్యుత్ సీఎండీ కార్యాలయ అధికారులను ఫేకర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు.ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో పాటు మాజీ వైస్ ఎంపీపీ బలగం వెంకటరావు విశాఖపట్నంలో సీఎండీ కార్యాలయ అధికారులకు గురువారం వినతిప త్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ్‌నగర్‌లోని కార్మికుల గృహాలకు ఫేకర్ యాజమాన్యం విద్యుత్ సరఫరా ను నిలిపివేయిస్తోందని, ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఎమ్మెల్యే సూచనల మేరకు సీఎండీ కార్యాలయంలో వినతిపత్రం అందించామని, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నా రని తెలిపారు. ఫేకర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కంది రామారావు, జి.సత్తిబాబు, కె.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ఉపాధి హామీ పథకంద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టేందుకు గుర్తించిన పనులకు మండల పరిషత్ సభ్యులు ఆమోదం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన ఉపాధి పనుల ఆమోదం కోసం గురువారం సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో తీర్మానించిన 3,205 పనులను రూ.102.20 కోట్లతో చేపట్టనున్నట్లు అధికారులు సభ దృష్టికి తీసుకురాగా సభ్యులు ఆమోదించారు. సీసీ రోడ్లు, కాలువలు, బీటీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, ప్రహరీలు, పంచాయతీ భవనాలు, శ్మశాన వాటికల్లో షెడ్లు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, రిటైయినింగ్ గోడలు, ఫీడర్ చానళ్లు, మినీ గోకులాల నిర్మాణం, మొక్కల పెంపకం, వంటి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ పేర్కొన్నారు. తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరున పునరుద్ధరించాలని సభ్యులు తీర్మానం చేసి జిల్లా పరిషత్‌కు పంపించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, ఎంపీడీఓ వై.భవాని, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశమైన ఏపీజీఈఏ సంఘం సభ్యులు

చీపురుపల్లి: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్(ఏపీజీఈఏ) నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం తాలూకా అధ్యక్షుడు పిస్నింటి హరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆసంఘం ముఖ్య నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏపీజీఈఏ ప్రభుత్వం తో చర్చలు జరుపుతోందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పీఆర్సీ,ఐఆర్‌లు ఇంతవరకు రాలేదన్నారు. సంఘంలో సభ్యత్వాల సంఖ్య పెంచాలని సభ్యులను కోరారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఏపీజీఈఏ జిల్లా ఇన్‌చార్జి గిడిజాల లక్ష్మినా యుడు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ జరజాన అచ్యుతరావు, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, రామ్మోహనరావు, శ్రీను, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూనెగింజలు, అపరాల సాగుపై అవగాహన



రైతులకు మినప విత్తనాలు పంపిణీ చేస్తున్న కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు

మెరకముడిదాం: నూనెగింజలు, అపరాల సాగు, యాజమాన్యపద్ధతులపై మండలంలోని సోమలింగాపురంలో రైతులకు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రైతులకు లామ్ పరిశోధనా స్థానం గుంటూరు వారు అభివృద్ధి పరిచిన మినుములు, తిరుపతి పరిశోధనా కేంద్రం అభివృద్ధి పరిచిన వేరుశనగ విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. శాస్త్రవేత్త ఎస్.ధృవ మాట్లాడుతూ నూనెగింజలు, అపరాల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధికదిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు తాము సాగు చేసిన పంటలోనే మేలైన వాటిని ఎంపిక చేసుకుని మళ్లీ పంట వేసుకునేందుకు విత్తనాలు కట్టుకోవాలని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎస్.శ్రవంతి, ఎస్.శ్రీనివాసరాజు, ఎం.అనంతవిహారి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ దామోదరరావు

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఆవరణలోని బాలికల వసతిగృహంలో పట్టణానికి చెందిన ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎస్‌ఐ ఎల్.దామోదరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. రోజుకు కనీసం రెండు గంటలు పుస్తక పఠనం చేయాలన్నారు. పుస్తకాలు ద్వారా ఎంతో విజ్ఞానం లభిస్తుందని, మొబైల్ ఫోన్లు, సినిమాలతో తాత్కాలిక కాలక్షేపం తప్ప మరే ప్రయోజనం ఉండదన్నారు. పుస్తకాలు చదవడం అలవాటుగా మారితే అవే పుస్తకాలు జీవితానికి మార్గదర్శకాన్ని అందిస్తాయన్నారు. ఆశయ స్వచ్ఛంద సంస్థ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని చెప్పారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, ఉపాధ్యాయుడు డోల నాగరాజు, వసతి గృహ సంక్షేమా ధికారి యశోధ, ఆశయ కార్యదర్శి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం

గుర్ల:



నిమజ్జనోత్సవంలో యువత, గ్రామస్తులు

వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగియడంలో మండల కేంద్రంలోని సత్తారు వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనోత్సవం ఉత్సవ కమి టీ గురువారం ఘనంగా నిర్వహించింది. మధ్యాహ్నం వినాయక మండపం వద్ద అన్నదానం చేశారు. అనంతరం గణనాథుడిని ఊరేగించారు. ఈసందర్భంగా మహిళలు యువత చేసిన కోలాటం, నృత్యాలు అలరించాయి.